మీ ఆశీస్సులు అందించండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: సీఎం వైఎస్ జగనన్న సైనికునిగా మార్కాపురం నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, మీ ఆశీస్సులు అందించాలని మార్కాపురం వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, ప్రస్తుత గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక సెవెన్ హిల్స్ లాడ్జిలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. గిద్దలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించానని, జగనన్న సహకారంతో మార్కాపురం నియోజకవర్గంలో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంలో ముందుంటానని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజలంతా తనను ఆశీర్వదించాలని కోరారు. ప్రతి ఒక్కరినీ తాను తప్పకుండా కలుస్తానన్నారు. 17 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, 2009లో ఎమ్మెల్యేగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేశానన్నారు. వచ్చే ఎన్నికల్లో మార్కాపురం వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, జగనన్న అభిమానులు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జేసీఎస్ కన్వీనర్లు, గ్రామ, వార్డు అధ్యక్షులు తన గెలుపు కోసం సహకరించాలని కోరారు. పాత్రికేయుల సమస్యలను కూడా తాను పరిష్కరిస్తానన్నారు. రాష్ట్ర కార్యదర్శి, ఏఎంసీ చైర్మన్ మీర్జా షంషేర్ అలీ బేగ్, మున్సిపల్ చైర్మన్ బాలమురళీ కృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్యాలెండర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ క్యాలెండర్, డైరీలను మార్కాపురంలో గిద్దలూరు ఎమ్మెల్యే నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ అన్నా రాంబాబు శుక్రవారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనను విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. యూనియన్ నాయకులు చంద్ర శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జంకెను సన్మానించిన నేతలు


జంకెను సన్మానిస్తున్న డీవీ కృష్ణారెడ్డి

మార్కాపురం: ఏపీఐఐసీ చైర్మన్‌గా నియమితులైన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డిని గురువారం జిల్లాకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. మార్కాపురం మాజీ ఏఎంసీ చైర్మన్ డీవీ కృష్ణారెడ్డి, తర్లుపాడు మాజీ ఎంపీపీ జి. శ్రీనివాసరెడ్డి, వెలిగండ్ల మాజీ జెడ్పీటీసీ సురేంద్ర, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, మార్కాపురం ఎంపీపీ అరుణా చెంచిరెడ్డి, సంజీవరెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ శివారెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త వెన్నా పోలిరెడ్డి జంకెను ఘనంగా సన్మానించారు.

ఎమ్మెల్యే కేపీ ఆర్థిక సాయంతో శ్మశాన వాటిక అభివృద్ధి


శ్మశాన మార్గంలో పనులు చేస్తున్న జేసీబీ

గిద్దలూరు రూరల్: మార్కాపురం ఎమ్మెల్యే, గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి ఆర్థిక సాయంతో పట్టణంలోని క్రైస్తవులకు చెందిన శ్మశాన వాటిక అభివృద్ధి పనులు గురువారం చేపట్టారు. పట్టణంలోని క్రైస్తవులు తమ శ్మశాన వాటికకు వెళ్లేందుకు మార్గం లేక చిల్లచెట్లు పెరిగి ఇబ్బందులు పడుతున్నామని నాగార్జునరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన తక్షణమే స్పందించి శ్మశాన స్థలం అభివృద్ధి కోసం తన సొంత నిధులతో పనులు చేయించారు. ఈ సందర్భంగా నాగార్జునరెడ్డికి క్రైస్తవులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే కేపీ ఆధ్వర్యంలో కారు ర్యాలీ

మార్కాపురం: గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా నియమితులైన మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు కంభం బస్టాండు నుంచి వేములకోట మీదుగా కార్ ర్యాలీ ప్రారంభం అవుతుందని పార్టీ నాయకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు జంగంగుంట్ల, 10.30 కందులాపురం సెంటరు, 11.00 బేస్తవారిపేట, 11.30 గంటలకు తాటిచర్ల మోటు నుంచి గిద్దలూరు, 12 గంటలకు గిద్దలూరు పట్టణం, 12.30 గంటలకు పాతాళ నాగేశ్వరస్వామి దేవస్థానం అనంతరం 01.00 గంటలకు మార్కెట్ యార్డులో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. గిద్దలూరు నియోజకవర్గ ముఖ్య నాయకులు, ఎంపీపీలు, మాజీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, యార్డు చైర్మన్లు, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు, సర్పంచ్‌లు, సచివాలయం కన్వీనర్లు, జగనన్న అభిమానులు, గ్రామ పార్టీ అధ్యక్షులు హాజరు కావాలని కోరారు.

వైఎస్సార్ సీపీ నేతలతో ఉడుముల భేటీ


సర్పంచ్, ఎంపీటీసీలతో మాజీ ఎమ్మెల్యే ఉడుముల

బేస్తవారిపేట: పట్టణంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులతో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి గురువారం భేటీ అయ్యారు. సోమవారిపేట, బేస్తవారిపేట, పాపాయిపల్లెలోని నాయకుల గృహాల వద్దకు వెళ్లి కలిశారు. పార్టీ గెలుపు కోసం కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. కేపీ నాగార్జునరెడ్డి గెలుపు కోసం సంపూర్ణ మద్దతు ఇస్తామని, పార్టీ విజయం కోసం పనిచేస్తామని నాయకులు తెలిపారు. సర్పంచ్ తండ్రి బుద్దుల ప్రేమానంద్, ఎంపీటీసీ సభ్యురాలు దగ్గుబాటి నాగమణి, మాజీ మండల ఉపాధ్యక్షుడు కారెపోతుల రంగయ్య, మాజీ ఎంపీటీసీ గర్రె పిచ్చయ్య, నాయకులు చిట్టె మల్లికార్జున, పుండరీ, ఒంటెద్దు పాండు, సుభాన్, దయ్యాల నరసయ్య, పిక్కిలి సుబ్బరాయుడు, దగ్గుబాటి రంగస్వామి, డాక్టర్ చల్లగాలి జోబ్‌పాల్‌ను కలిశారు. జెడ్పీటీసీ బీవీ రాజయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండా రఘునాథరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.ఈశ్వరరెడ్డి, మాజీ ఎంపీటీసీ బండ్లమూడి తిరుపతయ్య పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన రెడ్‌క్రాస్ సొసైటీ డైరెక్టర్


ఎస్పీని కలిసిన శ్రీనివాసరెడ్డి

కురిచేడు: జిల్లా నూతన ఎస్పీ పరమేశ్వరరెడ్డిని రెడ్‌క్రాస్ సొసైటీ డైరెక్టర్ కపురం శ్రీనివాసరెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ పరిస్థితులపై ఎస్పీ ఆరా తీశారు. రాబోయే ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు నియోజకవర్గ పరిస్థితులను తెలుసుకున్నట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు.

శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాల మార్పు


పాత స్తంభాల స్థానంలో ఏర్పాటు చేసిన నూతన స్తంభాలు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని ఐనముక్కల ఎస్సీ పాలెంలో పురాతన విద్యుత్ స్తంభాలు తొలగించి నూతన స్తంభాలు ఏర్పాటు చేయటంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో గతంలో వేసిన విద్యుత్ స్తంభాలు తమకు ఎంతో ఇబ్బందిగా మారాయన్న కాలనీ వాసులు చెప్పడంతో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపత్రి చంద్రశేఖర్ స్పందించారు. ఆయన ఆదేశాలతో నివాస గృహాలకు అడ్డంగా ఉన్న స్తంభాలను తొలగించి నూతన స్తంభాలు ఏర్పాటు చేశారు. కొంత కాలంగా నివాస గృహాలపైకి ఉన్న విద్యుత్ తీగలతో అల్లాడిన కాలనీ వాసుల కష్టాలు గురువారంతో తొలగాయి. తమ ఇబ్బందులను స్థానికులు కొందరు నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిపత్రి చంద్రశేఖర్ దృష్టికి తీసుకురావటంతో ఆయన స్పందించారు. ఐనముక్కలకు చెందిన మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు, విద్యుత్ కాంట్రాక్టర్ యక్కంటి వెంకటేశ్వరరెడ్డితో మాట్లాడి స్తంభాలను తొలగించి నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరడంతో గురువారం హుటాహుటిన పాత స్తంభాల స్థానంలో నూతన స్తంభాలు ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ కృష్ణయ్య

ముండ్లమూరు: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎస్ఐ యూవీ కృష్ణయ్య గురువారం పరిశీలించారు. మండలంలోని పోలవరం, వేంపాడు, ముండ్లమూరు, శింగనపాలెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో ఓటర్లకు సరైన వసతులు ఉన్నాయా, లేదా అని పరిశీలించారు. విద్యుత్ వసతి, ర్యాంపులు, రాకపోకలకు అనువుగా ఉందా లేదా అని తెలుసుకున్నారు. ఎన్నికల సందర్భంగా ఎన్నికల సిబ్బందికి, ఓటర్లకు అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని బీఎల్ఓలకు సూచించారు.

నేడు మన ఊరికి మన శివన్న

కురిచేడు: మన ఊరికి మన శివన్న కార్యక్రమం మండలంలోని పడమర నాయుడుపాలెంలో శుక్రవారం సాయంత్రం జరుగుతుందని దర్శి ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి కార్యాలయం ప్రతినిధి సందిరెడ్డి నరేంద్రరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

భక్తి భావంతో పులకించిన బోడేనాయక్ తండా


కార్యక్రమానికి భారీగా హాజరైన భక్తులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని బోడేనాయక్ తండాలో వీరాంజనేయ స్వామి ఆలయ నూతన శిఖర కలశ,కీర్తి ధ్వజ, పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. 12వ తేదీ నుంచి ప్రారంభమైన ప్రతిష్ఠ కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. ఉదయం నుంచి మహా పూర్ణాహుతి, మహాదాశ్వీరచనాలతో మొదలైన పూజా కార్యక్రమాలు నూతన శిఖర కలశ, కీర్తి ధ్వజ, పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలతో ముగిశాయి. సుదూర ప్రాంతాల్లో నివసిస్తున్న గ్రామానికి సంబంధించిన వారందరూ కార్యక్రమానికి హాజరు కావటంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. గ్రామంలో భారీగా అన్నదానం కార్యక్రమాలు చేశారు. ఆలయం వద్ద జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రముఖ సిద్ధాంతి పత్సళ్య సుబ్రహ్మణ్య శివరామ శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కేపీ


వాల్మీకి విగ్రహ పూజ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: రామాయణాన్ని రాసిన వాల్మీకి మహనీయుడని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. పట్టణంలోని కరెంటు ఆఫీసు వద్ద ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహా కావ్యాన్ని ప్రపంచానికి అందించారన్నారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీ కృష్ణ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతులకొండయ్య, సంఘం నాయకులు, మాజీ ఎంపీటీసీ మాగి పోలయ్య, భూపని కాశయ్య, మండ్లా రామాంజ నేయులు, కాశయ్య, శ్రీనివాసులు, పెనుగొండ కేశవరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజారంజక పాలన అందిస్తున్న జగనన్న

- ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్


పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న తాటిపర్తి చంద్రశేఖర్

పెద్దారవీడు: రాష్ట్రంలో ప్రజారంజక పాలన అందిస్తున్న సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి మరోసారి సీఎంగా గెలిపించుకుందామని ఎర్రగొండపాలెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తాటిపర్తి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మండలంలో దేవరాజుగట్టులో నూతనంగా వైఎస్సార్ సీపీ మండల కార్యాలయం ప్రారంభించారు. తొలుత గుర్రం బండిలో చంద్రశేఖర్‌పై పూలు చల్లుకుంటూ ఊరేగింపుగా బయల్దేరి దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సమన్వయంతో కలిసి మెలిసి వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. నవరత్నాలతో పేదల స్థితిగతులను మార్చిన వ్యక్తి జగనన్నే అన్నారు. రానున్న శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ విజయమే ధ్యేయంగా అంతా కలిసి పని చేద్దామని కార్యకర్తలను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా దుష్ప్రచారానికి ఒడిగట్టాయని విమర్శించారు. పార్టీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, ఏపీ ఇరిగేషన్ డైరెక్టర్, మాజీ ఎంపీపీ దుగ్గెంపుడి వెంకటరెడ్డి, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, మండల పార్టీ ఉపాధ్యక్షుడు తోకల ఆవులయ్య, సర్పంచులు గుడ్డెపోగు రమేష్, అంగిరేకుల ఆదినారాయణ, పాందుగుల వెంకటరెడ్డి, ఎంపీటీసీ దుదెకుల పకీరయ్య, మూల రమణారెడ్డి, నాయకులు జైనుల్లాబ్దీన్, వెన్నా శివకృష్ణారెడ్డి, నందిరెడ్డి రఘునాథరెడ్డి, షేక్ బుజ్జి, పంది గురవయ్య, నరాల రామచంద్రుడు, వెన్నా పెద్దపోలిరెడ్డి, మెట్టు భాస్కరరెడ్డి, కంచర్ల కేశయ్య, వల్లెల ఈశ్వరరెడ్డి, వజ్రాల ఆదిరెడ్డి, కీరా నాయక్, కాసు వెంకటరెడ్డి, సొంటి నాగార్జునరెడ్డి, ఒద్దుల లక్ష్మిరెడ్డి, ఇండ్ల భాస్కరరెడ్డి, కొండగురవయ్య, వల్లెల చెన్నారెడ్డి, గంజి మహిపాల్‌రెడ్డి, మూల సత్యంరెడ్డి, దండా రామకృష్ణారెడ్డి, సాయి కృష్ణ, బలుసుపాటి నాగరాజు పాల్గొన్నారు.

అనాథల సేవకుడు కాశయ్య


అనాథకు పరిచర్యలు చేసిన కాశయ్య, యోగి

కురిచేడు: అనాథలు ఎక్కడ కనిపించినా నేనున్నానంటూ వారిని అక్కున చేర్చుకుని వారికి సేవలందిస్తుంటాడు మండలంలోని పడమర వీరాయపాలెం గ్రామానికి చెందిన మోతుకూరి కాశయ్య. శ్రీ కరుణా అనాథ వృద్ధాశ్రమం దాతల సహకారంతో నిర్వహిస్తున్నాడు. చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లి అనాథలకు ఆహారం అందిస్తుంటాడు. ఆ క్రమంలో పల్నాడు జిల్లా నరసరావుపేట రైల్వేస్టేషనులో ఒక అనాథ వృద్ధుడిని అక్కున చేర్చుకున్నాడు. ఆ వృద్ధుడికి క్షవరం చేయించి ఆహారం, బట్టలు అందించాడు. గుంటూరుకు చెందిన ఆ వృద్ధుడు అందరిని కోల్పోయి అనాథయ్యాడు. ఈ సేవా కార్యక్రమంలో కాశయ్యకు యోగి మునెయ్య సహకరించారు.

క్లుప్తంగా..

నేటి నుంచి సీతారామ లక్ష్మణ విగ్రహాల ప్రతిష్ఠ


విద్యుద్దీపాల అలంకరణలో రామాలయం

దొనకొండ: మండలంలోని చందవరం గ్రామ కమిటీ మూకుమ్మడిగా నేటి నుంచి 19వ తేదీ వరకు సీతా రామ లక్ష్మణ గుడి, విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపడుతున్నారు. పురోహితులు గో పూజ, గణపతి పూజ, పుణ్యాహ వాచకం, అఖండ దీప ప్రతిష్ఠ, సర్వతోభద్ర కళశ స్థాపనం, రుద్రాభిషేకం, దీప ప్రతిష్ఠ, పారాయణం, హనుమాన్ చాలిసా, తీర్థ ప్రసాద వినియోగం చేశారు.

నేటి నుంచి ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు


ముస్తాబైన ఆలయం

కొనకనమిట్ల: మండలంలోని సలనూతల గాజులపల్లిలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు శ్రీగంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి నూతన కీర్తి ధ్వజ గోపుర శిఖర కలశ ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు మువ్వా వెంకటరెడ్డి తెలిపారు. మూడు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు ఎన్నికల సమర శంఖారావం ప్రారంభం

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శుక్రవారం నుంచి ఎన్నికల సమర శంఖారావం పూరించనుంది. ముందుగా మండలంలోని మురారిపల్లెలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపత్రి చంద్రశేఖర్ సిద్ధం అయ్యారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి తెలిపారు. సాయంత్రం 5 గంటలకు మురారిపల్లె, రాత్రి 7 గంటలకు కాశికుంట తండా, 9 గంటలకు బోయలపల్లెలో ప్రచారం జరుగుతుందని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం

దర్శి: పట్టణంలోని 17వ వార్డులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మన ఊరికి మన శివన్న కార్యక్రమం శుక్రవారం ఉదయం 7 గంటలకు నిర్వహించనున్నట్లు కార్యాలయం ప్రతినిధి సందిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి కురిచేడు మండలం నాయుడుపాలెం పంచాయతీలో ప్రచారం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు హాజరవుతారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు

కరాటేలో ప్రతిభ కనబరిచిన సాయిచైతన్య విద్యార్థిని


హేమలతను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

గిద్దలూరు రూరల్: పట్టణంలోని శ్రీ సాయిచైతన్య డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని హేమలత కర్నాటకలో నిర్వహించిన ఆల్ ఇండియా లెవెల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరచి గోల్డ్‌మెడల్ సాధించినట్లు కరాటే మాస్టర్ బూతరాజు శ్రీను తెలిపారు. బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న హేమలత 19 సంవత్సరాల విభాగంలో ఫైట్ స్పారింగ్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా హేమలతను కళాశాల కరస్పాండెంట్ జి.రంగస్వామిరెడ్డితో పాటు ఉపాధ్యాయులు అభినంధించారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రారంభం


సమాచార కరదీపికతో మేనేజర్లు

దొనకొండ: స్థానిక అంబేడ్కర్ సర్కిల్ కురిచేడు రోడ్డులో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని బ్యాంక్ మేనేజర్లు టి.అశోక్, చిన్ననాయక్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ ఆర్థిక అక్షరాస్యత పెంపొందించుకోవాలని, ఆర్థిక వ్యవహారాలు రిజర్వ్ బ్యాంక్ గుర్తించిన సేవలు చేయాలన్నారు. ఆర్థిక సంస్థల్లో మోసాలు జరిగితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ అంబుడెన్స్ ద్వారా పరిష్కారం పొందొచ్చన్నారు. కురిచేడు, కొనకనమిట్ల మండలాల్లో ఈ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సేవలు ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. సామాజిక భద్రత పథకాల గురించి అవగాహన చేశారు. కంభం సీఎఫ్ఎల్ కౌన్సిలర్ రాజకుమార్, దొనకొండ సీఎఫ్ఎల్ కౌన్సిలర్ శ్యామ్‌బాబు, హసినా పాల్గొన్నారు.

బెంగళూరుకు వెళ్లి ఈకేవైసీ చేయించిన వలంటీర్


బెంగళూరులో ఈకేవైసీ చేస్తున్న వలంటీర్ రవితేజ

తర్లుపాడు: మండలంలోని పోతలపాడుకు చెందిన వలంటీర్ రవితేజ వైఎస్సార్ చేయూతలో భాగంగా బెంగళూరుకు వెళ్లి లబ్ధిదారిరాలితో ఈకేవైసీ చేయించారు. రాచీటి ప్రేమమ్మ బంధువుల వద్ద ఉంటోంది. గ్రామానికి రాలేని పరిస్థితుల్లో వలంటీర్‌కు సమస్యను తెలియచేయడంతో బెంగుళూరుకు వెళ్లి ప్రేమమ్మతో ఈకేవైసీ చేయించాడు. సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నకేశవులు, సచివాలయం సిబ్బంది పలువురు నాయకులు వలంటీర్‌ను అభినందించారు.

విశ్వబ్రాహ్మణుల సంఘ అధ్యక్షుడిగా వీరభద్రాచారి

గిద్దలూరు రూరల్: విశ్వబ్రాహ్మణుల సంఘ గిద్దలూరు నూతన అధ్యక్షుడిగా ఎం.వీరభద్రాచారిని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గిద్దలూరు పరిసర ప్రాంతంలో ఈ నెల 11వ తేదీ వరకు సభ్యత్వ నమోదు ప్రక్రియ నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన ఎన్నికల్లో మొత్తం 102 మంది సభ్యులు పాల్గొని వీరభద్రాచారిని అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు, ఈ ఎన్నికల నిర్వహణ కర్త శ్రీనివాసాచారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.

చందలూరు విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దర్శి: బాలోత్సవంలో చందలూరు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు దేశభక్తి గీతాలాపనలో జూనియర్ విభాగంలో నవ జయంతి, వై.నందినీలకు 10 సర్టిఫికెట్‌లు ప్రథమ స్థానంలో ఇచ్చారని పీడీ అంజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో వారితో పాటు కోరస్ పాడేందుకు 8 మంది విద్యార్థులు భాగస్వామ్యం అయ్యారని చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు గంథం గురుప్రసాద్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

చెట్టును ఢీకొట్టిన టిప్పర్

దర్శి: దర్శికి చెందిన టిప్పర్.. ముందు వెళ్తున్న ట్రాక్టర్ ట్యాంకర్‌ను తప్పించబోయి చెట్టును ఢీకొట్టింది. గురువారం జరిగిన ఈ ఘటనలో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ ప్రమాదాన్ని గమనించి కిందకు దూకేయగా టిప్పర్ డ్రైవర్ మాత్రం టిప్పర్ క్యాబిన్‌లో ఇరుక్కున్నాడు. స్థానికులు వెంటనే అతడిని బయటకు తీసి 108లో ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్‌కు ఎటువంటి ప్రాణాపాయం లేదని తెలిపారు.

జూదరుల అరెస్టు

బేస్తవారిపేట: మండలంలోని ఎంపీ చెరువులో కోడిపందేల స్థావరాలపై ఎస్సై నరసింహారావు గురువారం దాడులు నిర్వహించారు. కోడిపందేలు ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేశారు. ఒక కోడి, రూ.5100 నగదు స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో పేకాట, కోడి పందేలు, నాటుసారా అమ్ముతున్న వారి వివరాలు అందజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

నీటి సమస్య తీర్చాలి


తర్లుపాడు : నీటి సమస్యను తీర్చాలంటూ మండలంలోని మేకలవారిపల్లి గ్రామ ప్రజలు జాతీయ రహదారిపై బైఠాయించి గురువారం నిరసన తెలియజేశారు. అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ సమస్య పరిష్కారం కావడంలేదని వాపోయారు. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో నీటి ఎద్దడి ఏర్పడి గ్రామంలోని బోర్లలో నీరు రావడంలేదని వారు తెలిపారు. ట్యాంకుల ద్వారానైనా నీటి సరఫరా చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

నేడు మార్కాపురంలో రథసప్తమి వేడుకలు



మార్కాపురంటౌన్: శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానంలో శుక్రవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు గౌరవ అధ్యక్షుడు పెనుగొండ కేశవరావు, అధ్యక్షుడు యక్కలి కాశీవిశ్వనాథం తెలిపారు. తిరుమల తరహాలో మార్కాపురంలో కూడా స్వామివారికి సప్తవాహనాలపై ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న బృంద సభ్యులు

తర్లుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌బీఐ తర్లుపాడు బ్రాంచ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై గురువారం అవగాహన కల్పించారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన వైవీఆర్ రూరల్ పబ్లిసిటీ బృందంచే మ్యాజిక్ షో ఏర్పాటు చేసి ప్రధానమంత్రి స్కీములను వివరించారు. హెచ్ఎం సుధాకర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25431

మార్కాపురం డివిజన్

99516 02963 (మార్కాపురం)

99122 25435 (గిద్దలూరు)

Office mail : sakshiongads@gmail.com